నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 23 మే 2025 | ADILABAD NIRMAL








ఖానాపూర్ రూరల్ : రాంరెడ్డిపల్లె శివారులో మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

- నిర్మల్ జిల్లావ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు
- ఖానాపూర్ ఎమ్మెల్యేను నిలదీసిన అన్నదాతలు
- రైతులతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వాగ్వాదం
- అన్నదాతకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు

**ఎమ్మెల్యేకు కోపం వచ్చింది**

1 ఖానాపూర్ రూరల్ : ఎమ్మెల్యే బొజ్జును నిలదీస్తున్న రైతులు

2 3 4 కడెం : రైతులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

# కర్షకుల కన్నెర్ర

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన



ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్


నిర్మల్, మే 22(నమస్తే తెలంగాణ) : వర్షంతో తడిసి ముద్ద యిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటూ అన్నదాతలు ఆందోళన బాట పట్టారు. రెండు రోజుల నుంచి రైతులు చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. గురువారం నిర్మల్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల ప్రధాన రహదారులు రైతుల రాస్తారోకోలతో రణరంగంగా మారాయి. ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖానాపూర్-నిర్మల్ ప్రధాన రహదారిపై రైతులు పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో చేపట్టారు. పక్షం రోజులుగా ధాన్యాన్ని అమ్ముకుందామని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చామని, కొనుగోళ్లలో జరిగిన జప్యంతో ధాన్యం తడిసిపోయిందంటూ రైతులు ఆందోళనకు దిగారు. అలాగే నర్సాపూర్(జి) మండల కేంద్రంలో రైతులు ఆందోళన చేశారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ భైంసా-నిర్మల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. దాదాపు రెండు గంటలపాటు నిరసనకు దిగడంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. ఖానాపూర్ మండలంలోని సత్తనపెల్లి ప్రధాన రహదారిపై గోడలపంపు, బీర్‌నంది, కొత్తపేట గ్రామాలకు చెందిన రైతులు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. అలాగే కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన రైతులు నచ్చన్ ఎల్లాపూర్ గ్రామం వద్ద నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారిపై బైఠాయించారు. లింగాపూర్ కొనుగోలు కేంద్రంలో కుప్పలు తెప్పలుగా వడ్ల రాశులు ఉన్నాయని, కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని మండిపడ్డారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

### ఎమ్మెల్యేపై రైతుల ఆగ్రహం

కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్‌లో రైతులు చేస్తున్న ఆందోళన విషయాన్ని తెలుసుకుని వచ్చిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేసి ఆయనతో వాగ్వాదానికి దిగారు. కొద్దిరోజులుగా ఇక్కడ ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో తామంతా తీవ్ర ఆందోళన చెందుతున్నామని, తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ పలువురు రైతులు ఆయనపై మండిపడ్డారు. ఈ క్రమంలో కొంత అసహనానికి గురైన ఎమ్మెల్యే తాను ఇక్కడికి వస్తున్న సమాచారాన్ని తెలుసుకుని కొంతమంది బీఆర్ఎస్ నాయకులు మిమ్మల్ని రెచ్చగొడుతున్నారన్నారు. మీరంతా అసలైన రైతులైతే ఆందోళన చేయరని, మీ వెనుక ఎవరో ఉండి నడిపిస్తున్నారంటూ ఎమ్మెల్యే అనడంతో అక్కడున్న రైతులంతా ఒక్కసారిగా ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను ఎవరూ రెచ్చగొట్టలేదని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని కోరుతూ పార్టీలకతీతంగా రైతులమంతా కలిసి ఆందోళన చేపడుతున్నామన్నారు. ఒక దశలో అటు ఎమ్మెల్యే అనుచరులు, ఇటు రైతులు దూషణకు దిగారు. ఇరువురి మధ్య ఘర్షణ వాతావరణం నెలకున్నది. ఆంక్షలు లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమనిగింది.

### అన్నదాతకు అండగా బీఆర్ఎస్

వర్షం కారణంగా నష్టపోయిన రైతులకు బీఆర్ఎస్ అండగా నిలిచింది. కొనుగోలు కేంద్రాలతోపాటు కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేలా రైతుల పక్షాన పోరాడుతామని పలువురు బీఆర్ఎస్ నాయకులు అన్నదాతలకు భరోసా కల్పించారు. గురువారం నిర్మల్ మండలంలోని మంజులాపూర్, చిట్యాల్ తదితర గ్రామాల్లోని కొనుగోలు సెంటర్లను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ సుభాష్‌రావు, మారుగొండ రాము సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. సుభాష్‌రావు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేవరకు వారికి అండగా ఉంటామన్నారు. తేమ శాతాన్ని పట్టించుకోకుండా తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు.



నర్సాపూర్(జి) : రాస్తారోకోతో నిలిచిన వాహనాలు



కడెం : నచ్చన్‌ఎల్లాపూర్ వద్ద అన్నదాతలు, నాయకులు



ఖానాపూర్ : ఎన్టీఆర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు



నర్సాపూర్(జి) : రాస్తారోకో చేస్తున్న రైతులు

# కేటీఆర్ దిశానిర్ధేశం

## బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

- స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులు సిద్ధంగా ఉండాలి
- నిర్మల్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో నాయకులకు సూచన

నిర్మల్ అర్బన్/భైంసా, మే 22 : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ అధ్యక్షతన గురువారం నిర్మల్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నిర్మల్ నియోజకవర్గం నుంచి నియోజకవర్గ సమన్వయకర్త రాం కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నేతలు సమావేశానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నేతలకు కేటీఆర్ దిశానిర్ధేశం చేశారు. పార్టీ బలోపేతనానికి పాటుపడాలని పని చేసే కార్యకర్తలు, నేతలకు పూర్తి గౌరవం ఉంటుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులంతా సిద్ధం కావాలని, జిల్లాలో బీఆర్ఎస్ జెండా ఎగుర వేయాలన్నారు. మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, విలాస్ గాదేవార్, పడకంటి రమాదేవి, డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలకు దిశానిర్ధేశం చేస్తున్న కేటీఆర్

### ఐదు రోజులు అవుతున్నది..



నేను 45 క్వింటాళ్ల జొన్నలను అమ్మడానికి మేడిగూడ సెంటర్‌కు తీసుకొచ్చి ఐదు రోజులు అవుతున్నది. గురువారం నాటికి కూడా పంటను కొనుగోలు చేయడం లేదు. 19వ తేదీన పంట నాణ్యత పరిశీలించి పాసింగ్ చేశారు. ఎందుకు కాంటా చేయడం లేదని పీఏసీఎస్ సిబ్బందిని అడిగితే గన్నీ సంచులు(బార్‌దాన్) లేవని అంటున్నారు. సంచులు ఈ రోజు వస్తాయి, రేపు వస్తాయి అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షం పడుతుండడంతో పంట తడిసిపోతున్నది. పైన కవర్లు కప్పినా.. కింద నుంచి నీళ్లు వచ్చి నష్టం జరుగుతుంది. అధికారులు స్పందించి పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

**- రాకేశ్, రైతు, మేడిగూడ, సాత్నాల**

### సంచులు లేవంటున్నారు..



నేను 70 క్వింటాళ్ల జొన్నలను అమ్మకానికి వారం రోజుల కిందట తీసుకొచ్చా. సగం పంటను కొనుగోలు చేసిన సిబ్బంది సంచుల లేవని మిగతా పంటను కొనడం లేదు. మొత్తం పంటను తీసుకోమని అడిగితే బరాదాన్(గన్నీ సంచులు ) లేవని అంటున్నారు. పంటకు కాపలాగా కొనుగోలు కేంద్రంలో ఉండాల్సి వస్తున్నది. లారీలు రాకపోవడంతో నింపిన సంచులను తీసుకుపోవడం లేదు. బుధవారం కురిసిన వర్షంతో పంట నింపిన సంచులు తడిసిపోయాయి. వాటిని ఆరబెట్టి వేరే సంచుల్లో నింపమని కొనుగోలు కేంద్రాల సిబ్బంది సూచిస్తున్నారు. దీంతో కూలీలకు డబ్బులు ఎక్కువ చెల్లించాల్సి వస్తుంది. అధికారులు స్పందించి పంట కొనుగోళ్లలో జాప్యం జరగకుండా చూడాలి.

**- భూమారెడ్డి, రైతు, మేడిగూడ, సాత్నాల మండలం**

సాత్నాల మండలం మేడిగూడ కొనుగోలు కేంద్రంలోతడిసిన జొన్నల సంచులను ఎండబెడుతున్న రైతులు



- పంటను కొనాలని వేడుకుంటున్న రైతులు
- సంచులు లేక నిలిచిన కొనుగోళ్లు
- లారీలు రాక కేంద్రాల్లోనే ధాన్యం
- అవస్థలు పడుతున్న రైతన్నలు

# జొన్న తడిసింది

ఆదిలాబాద్, మే 22(నమస్తే తెలంగాణ) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మార్కెట్ యార్డుల్లో జొన్న పంట తడిసింది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట కండ్ల ఎదుట తడిసిపోతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. సాత్నాల మండలంలోని మేడిగూడలో ఆరుబయట ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వర్షం కారణంగా జొన్నలు తడిశాయి. కొనుగోలు చేసిన పంటను సంచుల్లో నింపగా లారీలు రాకపోవడంతో సంచులు తరలింపులో జాప్యం జరుగుతున్నది. దీంతో పీఏసీఎస్ సిబ్బంది తడిసిన సంచులను ఎండబెట్టమని రైతులకు సూచిస్తున్నారు. రాత్రి, పగలు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నామని రైతులు అంటున్నారు. మాడు రోజులు వర్షం ఉండడంతో పంటను కొనుగోలు చేసి బస్తాలను గోదాములకు తరలించి తాము నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు